

118
ధారావాహిక

# జాయ సేనాపతి

చారిత్రక కాల్పనిక నవల

మత్తి భానుమూర్తి ...
99893 71284

**జరిగిన కథ :** భావి కాకతీయ సామ్రాట్టు.. మురారిదేవుడు యుద్ధానికి రాకపోవడంపై కాస్త నిరాశతో ఉన్నాడు జాయప. 'ఏమిటి వాడి మనస్తత్వం?' అనే ఆలోచనలో ఉన్నాడు. ఆ విషయం.. శుక్ర చెప్పాడు. ఒకనాడు రాత్రి దీపాలు వెలిగించిన తర్వాత.. జాయపను కలవడానికి వచ్చాడు. కాసేపు ఇద్దరూ పిచ్చాపాటిగా మాట్లాడుకున్న తర్వాత.. అసలు విషయంలోకి దిగాడు శుక్ర. మురారిదేవునికీ.. రుద్రదేవమ్మకూ మధ్య పడటం లేదనీ.. ఇద్దరూ 'ఢీ అంటే ఢీ!' అనేలా ఉంటున్నారని చెప్పుకొస్తున్నాడు.

మరియవాడ.. మరియలు అంటే చిన్నచిన్న అంగళ్లు. అక్కడ తినుబండారాలు ప్రసిద్ధి. నాలుగైదు వీధులతో విస్తరించి ఉంది మరియవాడ. మరియల ముందు అమ్మకాలు, వెనుక వసారాలో వంట.. ఘుమఘుమలు, వాటివెంట పిడకల పొగ.. వీధులన్నిటినీ చుట్టేసి నోరూరిస్తున్నాయి. వాటికితోడు వీధులలో వస్తూ పోతూ ఆగిన బళ్లు.. ఎడ్ల మెడల్లో చిరుగంటల చిరు చిరు నాదాలు.. కొనుగోలుదారుల మాటలు, నవ్వులు ముచ్చట్లు.. మరియదారుల వినయ వ్యాపారాలు.. ఉదయపు రెండవ ఝామువేళ పత్తిపువ్వుల మాగాణిలా తెల్లని ఎండ విరగకాస్తోంది.

ఓ తినుబండారాల మరియ. దాని ప్రధానస్థానంలో తక్కెడ పట్టుకుని వణిజుడు కూర్చుని ఉన్నాడు. లోపల కోరిన వంటలు చేస్తుండగా ఒకామె వాటిని వేడివేడిగా మోదుగాకులలో పెట్టి తక్కెడలో ఉంచగా.. ఆ వణిజుడు తూకం వేయగా.. వాటిని మరియ ముందు కూర్చుని తింటున్నవారికి అందిస్తోందామె.

బిడ్డ కాబోలు. పదేళ్లు ఉండొచ్చు. మంచినీళ్ల చెంబులతో సిద్ధమై అడిగిన వాళ్లకు అందిస్తోంది.

'రుచి అదిరిపోయింది' అన్నాడు తమ్ముడు.

'అద్భుతం..' అన్నాడు మిత్రుడొకరు.

బుగ్గల నిండా పెట్టి తింటున్న మిగిలినవారు వేళ్లు నాకుతూ అవునవును అన్నట్లు తలలూపారు. తల ఊపినవారిలో అక్క కూడా ఉంది. చెంబు అందుకుని గటగటా తాగి తెంచి.. 'నిజమే తమ్ముడూ.. బహు బాగు.. నాకు మరో మోదకం..' అంది గుటకలు వేస్తూ. అందరూ మళ్లీ తమకు కావాలని చెయ్యెత్తి చూపారు. అప్పుడు అనుకోకుండా ఓ సంఘటన జరిగింది.. ఆ అక్కా తమ్ముడు..

చెబుతున్న శుక్రను ఆపమన్నట్లు చెయ్యెత్తాడు జాయచోడుడు.

''ఓ అక్కా.. ఓ తమ్ముడు.. అతని మిత్రులు. అలా చెప్పడం ఎందుకు? మురారి, రుద్రమ అని చెప్పవచ్చుగా.. వాళ్లే అని.. చూసినట్లు చెబుతున్నావ్?!'' జాయచోడుని గొంతులో అసహనం.

వాళ్లు కాదని చెబితే బావుండును అనే ఆశ లీలగా ధ్వనిస్తోంది.

''నా నియోగ ఉద్యోగులు తెలుసుకుని చెప్పిందే.. నేను తమరికి నివేదిస్తున్నాను ప్రభు!''

''అంటే.. మీవాళ్లు గూఢచర్యం చేస్తున్నారా? అందుకో నియోగం ఉంది కదా!''

''ఉంది. అది రహస్యంగా సమాచారం సేకరించి ప్రభువులకు, ప్రధానికి నివేదిస్తుంది. పైగా అది రాజ్యమంతా.. ఆ మాటకొస్తే శత్రు, మిత్ర రాజ్యాలన్నిటిలో పనిచేస్తుంది. మా పరిధి కేవలం అనుమకొండ మాత్రమే. మేము బాహాటంగా పురవాసులు ఏమి అనుకుంటున్నారో వాళ్లతో మాటామంతి ద్వారా తెలుసుకుని ఓ అభిప్రాయానికి వచ్చి సిద్ధంగా ఉంటాం. ప్రభువులు అడిగినప్పుడు చెబుతాం..''